క్లుప్తంగా

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం అమర్నాథ్

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్, పట్టణ సీఐ శ్రీనివాసులు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసి డిపోలో డ్రైవర్లు, కార్మికులతో ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. డీజిల్ మైలేజ్ తెచ్చి డిపో అభ్యున్నతికి డ్రైవర్లు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డిపో సూపరింటెండెంట్ పంపాపతి, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ బాలాంజినేయులు, ఇన్‌చార్జ్ సీఐ ఎల్లప్ప పాల్గొన్నారు.

నైతిక విలువలు కలిగి ఉండాలి



ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న సామ్‌గుంటి

ఎమ్మిగనూరురూరల్: బాలబాలికలు నైతిక విలువలను కలిగి ఉండాలని ఆర్గనైజర్లు జి.బి. ప్రవీణ్‌కుమార్, ఎస్.నీలిమ, కే లుక్ జాన్సన్ అన్నారు. గురువారం కలుగోట్ల రోడ్డులోని హోసన్న మందిరం సమీపంలో బాలబాలికలకు హైదరాబాద్ స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'వి బ్యాక్ టు స్కూల్' క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి జి.సురేష్ అధ్యక్షత వహించారు. క్యాంప్‌లో అంతర్జాతీయ ఇంద్రజాల ప్రదర్శకులు సామ్‌గుంటి ప్రదర్శన పిల్లలను మంత్రముగ్ధులను చేసింది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 25 సంవత్సరాల నుంచి యువకులను ఇంద్రజాలం ద్వారా చైతన్యవంతులను చేస్తున్నామని చెప్పారు. క్యాంప్‌లో పాల్గొన్న బాలబాలికలకు భోజనంతో పాటు ఉచితంగా క్రాఫ్ట్స్, స్టేషనరీ, క్రేయాన్స్, పుస్తకాలను అందజేశారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



పూలతో అలంకరించిన ఖాదర్‌లింగస్వామి సమాధి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు



ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి హొళగుంద సాయిబన్న, చిజిగితాతా దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తమ మొక్కులో భాగంగా కొందరు భక్తులు దర్గా ఆవరణలో నిద్రించారు. అలాగే.. హొళగుందలో షిర్డిసాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసెలోని సామగ్రి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో కోడుమూరు వీరకోటికి చెందిన గుడిసె గురువారం దగ్ధమైంది. వీరకోటి కుటుంబం ఉదయం పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా గుడిసెకు మంటలు వ్యాపించడంతో గుడిసెలోని నిత్యావసర సరుకులు, వివిధ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గుడిసె కాలిపోవడంతో వీరకోటి కుటుంబ రోడ్డున పడింది.

అటకెక్కిన ఐటీఐ



వసతిగృహ భవనం

- ప్రణాళిక లేకుండా ఐటీఐ కళాశాల భవన నిర్మాణం
- ప్రారంభానికి నోచుకోని వైనం
- నిరుపయోగంగా భవనాలు
- చుట్టూ పెరిగిన ముళ్లపొదలు
- విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

ఆదోని సెంట్రల్: యువతకు వివిధ ట్రేడ్‌లలో శిక్షణను ఇచ్చి ఉపాధి కల్పించి అభివృద్ధి బాటలో నడిపించడానికి ప్రభుత్వాలు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే గతంలో టీడీపీ ప్రభుత్వం ఆదోని మండలం ఆరెకల్లు గ్రామంలో ముస్లిం మైనార్టీల విద్యార్థుల కోసం పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాల నిర్వహణ కోసం భవనాలను నిర్మించింది. అయితే ప్రారంభించడం మరిచింది. కళాశాలలో వివిధ ట్రేడ్‌లకు సంబంధించిన మెటీరియల్‌ను కొనుగోలు చేయకపోవడం, అధ్యాపలకులను నియమించకపోవడంతో నేటికీ ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారడంతో పాటు ముస్లిం మైనార్టీ యువతకు వృత్తి విద్య అందని ద్రాక్షగా మారింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఇప్పటికై నా కళాశాలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. కళాశాల ఎప్పుడు ప్రారంభమవుతుందోనని యువకులు ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల వేళ ఆగమేఘాలపై నిర్మాణం..

ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలో ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం 2018లో పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాల నిర్మాణానికి శ్రీ కారం చుట్టారు. రూ.3.91 కోట్లతో తరగతులను నిర్వహించడానికి తరగతి గదులను, ప్రాక్టికల్ నిర్వహించడానికి అదనపు గదులను, విద్యార్థులకు వసతిగృహాల భవనాలను సైతం నిర్మించారు. 2018-19 మధ్య కాలంలో భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే కొన్ని కారణాల వల్ల కళాశాల ప్రారంభానికి నోచుకోనలేదు. కళాశాల నిర్వహణ కోసం వివిధ ట్రేడ్‌లకు సంబంధించిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచి ప్రారంభించాల్సి ఉంది. ఎన్నికలు సమీపిస్తున్నాయని, ముస్లిం యువతను ఆకర్షించేందుకు ఆఘమేఘాలపై కళాశాల భవనాలు నిర్మించడం, ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో పాటు పలు రాజకీయ కారణాలతో ప్రారంభానికి నోచుకోవడంలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలకు సంబంధించిన నిధులు మంజూరు కాక, అధ్యాపకులను నియమించక పోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. కళాశాల ప్రారంభానికి నోచుకోక పోవడంతో భవనాలు నిరుపయోగంగా మారి చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు మొలచి కళాశాల ఆవరణ అస్తవ్యస్తంగా మారింది.



తరగతులను నిర్వహించేందుకు నిర్మించిన భవనం



ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు నిర్మించిన భవనం

కళాశాల ఏర్పాటు అయితే 200 మందికి శిక్షణ

ఆదోని డివిజన్ ప్రాంతంలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. ఐటీఐ కళాశాల ప్రారంభమైయితే 200 మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు వివిధ ట్రేడులలలో నైపుణ్య శిక్షణలు పొంది ఉద్యోగ, స్వయం ఉపాధి పొందేందుకు అవకాశాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీ ప్రజల కోరిక మేరకు ఐటీఐ కళాశాలకు భవనాలను అయితే నిర్మించడంతో నేడో రేపో కళాశాల మంజూరు అవుతుందని నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఎదురు చూపులు చూస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడితే చాలమంది యువకులు వివిధ ట్రేడ్‌లలో నైపుణ్య శిక్షణ పొందేందుకు అవకాశాలు ఉన్నాయి. కళాశాలకు అవసరమైన సామగ్రితో పాటు అధ్యాపకులను నియమించేందుకు చర్యలు చేపట్టాలి. అప్పుడే నిరూపయోగంగా ఉన్న భవనాలు ఉపయోగంలోకి వస్తాయి. యువతకు శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి పొందేందుకు అవకాశాలు ఉన్నాయి.

కళాశాలను ప్రారంభించాలి



ముస్లిం మైనార్టీ యువకుల కోసం ఐటీఐ కళాశాలను ప్రారంభించాలని కొంత కాలంగా అధికారులను పాలకులను అడుగుతున్నాం. కళాశాలకు అవసరమైన భవనాన్ని అయితే నిర్మించారు గాని నేటి వరకూ కళాశాల మాత్రం ప్రారంభం కాలేదు. కళాశాల ప్రారంభమైతే 200 నుంచి 250 మంది విద్యార్థులు నైపుణ్య శిక్షణ పొందే అవకాశం ఉంది. దీంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాసులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రారంభించేందుకు చర్యలు చేపడుతాం

ముస్లిం మైనార్టీ ఐటీఐ కళాశాలను త్వరలో ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతున్నాం. గతంలో ఎందుకు ప్రారంభం కాలేదో తెలియదు. నేను రెగ్యులర్‌గా కర్నూలు ఐటీఐలో విధులు నిర్వహిస్తున్నా.. ఈ మధ్యనే ఆదోని కళాశాల ఇన్‌చార్జ్ బాధ్యతలను చేపట్టాను. కళాశాల ప్రారంభానికి చర్యలు చేపట్టే విధంగా అధికారులకు విన్నవిస్తూ వచ్చాం. పారిశ్రామిక శిక్షణ సంస్థ అధికారులు కూడా వివిధ ట్రేడ్‌లకు సంబంధించి (టూల్స్) మెటిరీయల్ కనుగోలు చేయడానికి రూ. 3లక్షల నిధులను కూడా కేటాయించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభించడానికి తగు చర్యలు తీసుకొంటున్నాం.

– సూరప్ప, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక



నాగేశ్వరరావు

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్ద మరిపీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆరెకటికె నాగేశ్వరరావును వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపిక చేశారు. అయన తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను పురస్కారం దక్కనుంది. నాగేశ్వరరావు రెండు వేలకు పైగా వచన కవితలు రాశారు. మణిపూసలు ప్రక్రియలో 500, సున్నితం ప్రక్రియలో 700, బాల సాహిత్యంలో 100కు పైగా గేయాలు మెరుపులు, తణుకులు, ముత్యాలహారం, రాజశ్రీయులు మొదలైన ప్రక్రియలో శతాధికంగా రాశారు. అలాగే నాలుగు పుస్తకాలు కవినేత్రం, యుగపురుషులు, కవి పుంగవులు-జాతి నేతలు, అక్షరగ్రామికుడు వంటి పుస్తకాలను ప్రచురించారు. శ్రీ కొత పూర్ణానంద్ విలాస్ కళా వేదిక విజయవాడలో శ్రీ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈనెల 21న జరిగే కార్యక్రమంలో పురస్కారం అందజేయనున్నట్లు నాగేశ్వర రావు గురువారం తెలిపారు.

ఇసుక రవాణాలో నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: ఇసుక తవ్వడం, రవాణాలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక కావలసిన వారు గ్రామ సచివాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి లిఖిత పూర్వకంగా అనుమతి పొందాలన్నారు. సొంత అవసరాలకు వాగులు, వంకల్లో ఇసుకను మనుషులతో మాత్రమే తోడించి తీసుకెళ్లవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో చూపిన ఇసుక రీచ్ నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే తరచూ ఇసుక తరలించే బాడుగ ట్రాక్టర్ల యజమానులు తమ వాహనాలకు జీపీఎస్ పరికరం అమర్చుకోవాలని సూచించారు. ఉచితం మాటున ఇసుక తీసుకొని వచ్చి ఎక్కువ రేటుకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



గెలుపొందిన జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్రికెట్ విజేత చింతకుంట

కోసిగి : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో చింతకుంట గ్రామ జెట్టు విజేతగా నిలిచింది. గురువారం గ్రామంలో చింతకుంట, కోసిగి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఇందులో చింతకుంట జట్టు గెలుపొందగా వారికి ప్రథమం బహుమతి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్‌రెడ్డి సహకారంతో రూ. 10,116 నగదును అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన కోసిగి జట్టుకు వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు ఈరన్న రూ. 5,116 నగదును ఇచ్చారు. తృతీయ బహుమతి చింతకుంటకు చెందిన మరో జట్టుకు మాన్వి వెంకటేష్ రూ. 3,116, నాలుగవ స్థానంలో నిలిచిన కోసిగి జట్టుకు రూ. 2,116 నాయకులు నరసింహులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక హైస్కూల్ 2000-01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, సురేశ్ ఎలెవన్ టీం సంయుక్తంగా పట్టణంలోని బాలుర హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి సూపర్-8 క్రికెట్ టోర్నీని ఏఎస్ఐ శివరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. హెడ్ కానిస్టేబుళ్లు నరసింహులు, శ్రీను, నిర్వాహకులు శ్రీనివాసులు, సురేశ్, సుమన్, రాహుల్, అనూప్, సూరి, ముత్యాల సుమన్, నగేశ్, మధు పాల్గొన్నారు.

పక్కీరప్ప తాతకు పూజలు



మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో కొలువైన అవధూత పక్కీరప్ప తాతను గురువారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆకు పూజ, మహామంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

పోటీల్లో విజయరంకేసిన గుడేకల్ ఎద్దులు



రాతి దూలం లాగుతున్న ఎద్దులు

తుగ్గలి : మౌలాలిస్వామి ఉరుసు సందర్భంగా గురువారం ఉప్పర్లపల్లిలో నిర్వహించిన దేశవు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీల్లో ఎమ్మిగనూరు మండలం గుడేకల్ ఎద్దులు విజేతగా నిలిచాయి. పోటీలను టీడీపీ నాయకులు నాగేంద్ర, అప్పా వేణు, బహుమతి దాతలు ప్రారంభించారు. పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొనగా గుడికల్ చాకలి దస్తగిరి ఎద్దులు 4,545 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. తర్వాతి స్థానాల్లో జొన్నగిరి మస్తాన్ యాదవ్ ఎద్దులు 4,500 అడుగులు, బొమ్మనహాల్ మండలం ఉద్దేహాల్ బసన్న, లింగదహాల్ ఎర్రిస్వామి ఎద్దులు సంయుక్తంగా 4,235 అడుగులు, దేవనకొండ మండలం జి.ప్యాలకుర్తి ఉశేన్ ఎద్దులు 3,933 అడుగులు, గుడికల్ చాకలి నల్లయ్య ఎద్దులు 3,827 అడుగులు లాగాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతలు అప్పా జగన్‌మోహన్ రూ.30వేలు, మనోహర్, రుసింగముని, లాలుస్వామి, జొన్నగిరి అనుమన్న కలిసి రూ.20వేలు, వేపమాను మహేష్ రూ.15వేలు, ట్రాక్టర్ హుసేన్ పీరా రూ.10వేలు, జిన్నె ప్రియాంక రూ.5వేల నగదు అందజేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులగౌడ్, వెంకటస్వామి, అప్పా చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఈశ్వరయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు కొట్టివేత

ఆదోని రూరల్: కౌతాళం మండలంలోని వీర్లదిన్నె గ్రామంలో 2014లో జరిగిన దాడి కేసులో అప్పట్లో నలుగురిపై ఐపీసీ 307, 354, 506, 509, ఆర్/డబ్ల్యూ34 ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన కేసును కొట్టివేస్తూ ఆదోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి యజ్ఞ నారాయణ గురువారం తీర్పునిచ్చారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు రుజువు కానందువల్ల బాపురం మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగరాజు, కాడప్పలను నిర్దోషులుగా నిర్ధారించి కేసును కొట్టి వేస్తున్నట్లు చెప్పారు. 2014 కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీర్లదిన్నె గ్రామంలో లక్ష్మీదేవి అనే మహిళపై దాడి జరిగిందని, అప్పట్లో కేసు నమోదయ్యింది. నిందితుల తరపున అడ్వకేట్ టి.మధుసూదన్ తన వాదనలు వినిపించారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ

ఆదోని రూరల్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై పట్టణంలోని నాక శిక్షణ కేంద్రంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనందరాజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సంకల్ప్ పథకంలో భాగంగా మూడు రోజులపాటు వ్యవస్థాపకత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. వివరాలకు 91774 13642 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 30, 31వ తేదీల్లో విజయవాడలో జరిగే ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మధు, ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మంగళ అనంత ఆంజనేయస్వామి ఆలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర మహాసభల ద్వారా ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేయడం జరుగుతుందన్నారు. మహాసభల్లో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో బ్యాంకు దగ్గర గుంపు గుంపులుగా రోడ్డుపై వెలుతున్న గుర్రాలు

రేసు గుర్రాలు కాదు.. రోడ్డుపై అవరోధాలు

- మెయిన్ రోడ్డుపై గుర్రాల సంచారం
- మందలుగా తిరుగుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

గోనెగండ్ల : రోడ్డుపై గుర్రాలు చూసి ఇదేదో గుర్రాల రేసు అనుకున్నారా!.. కాదు ఇవి రోడ్డుపై సంచరిస్తున్న గుర్రాలు. మండల కేంద్రం గోనెగండ్లలోని ఎమ్మిగనూరు- కర్నూలు ప్రధాన రహదారిపై పశువులు, గుర్రాలు సేదదీరుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. బస్టాండ్ సమీపంలో, వైఎస్సార్ సర్కిల్, చాంద్ థియేటర్ సెంటర్, పోలీస్ స్టేషన్ క్రాస్ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో భారతీయ స్టేట్ బ్యాంక్ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు రహదారిపై ఆవులు, గుర్రాలు మందలుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో రద్దీ తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వస్తుంటాయి. అయితే వాటిని గుర్తించని వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో స్థానిక సంతమార్కెట్ రోడ్డులో పంచాయతీ బందెరదొడ్డి ఉండేది. సంచరిస్తున్న పశువులను పంచాయతీ అధికారులు బందెరదొడ్డిలో ఉంచేవారు. అయితే ఇప్పుడు ఎవరు పట్టించుకోకపోవడంతో అవి నిత్యం రోడ్లపై తిరుగుతూ వాహనాలకు అడ్డంగా ఉంటున్నాయి. ఇప్పటికై నా అధికారులు చర్యలు తీసుకొని పశువులు, గుర్రాలను రోడ్లపైకి రాకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

దేవనకొండ: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం దేవనకొండలోని ఏపీజీబీ బ్యాంకు ముందు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించేందుకు ప్రభుత్వాలు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, తరలింపు ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఏపీలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంక్, సప్తగిరి, చైతన్య గోదావరి బ్యాంకుల విలీనం ద్వారా గ్రామీణ బ్యాంకులను ఏకీకరణ చేయడం భవిష్యత్‌లో ప్రైవేటీకరణకు దారి తీస్తుందన్నారు. కడప నుంచి రాజధాని ప్రాంతంలోకి ప్రధాన కార్యాలయాన్ని తరలించేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. అనంతరం బ్యాంకు అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు నాగేష్, బలరాముడు, రాము, మహేష్, వీరాంజనేయుడు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర : మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల్లో మురగునీరు నిల్వ లేకుండా, శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని చెప్పారు. ఎక్కువ రోజులు జ్వరాలు వస్తుంటే వెంటనే వైద్యశాలలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలియజేయాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

చిప్పగిరి: దారికి వేసిన రాళ్ల విషయంలో గొడవపడి తీవ్రంగా గాయపడిన మండలంలోని బంటనహాలు గ్రామానికి చెందిన కాజీపురం రామాంజనేయులు కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామాంజనేయులు, అదే గ్రామానికి చెందిన తలారి సురేష్ దారిలో వేసిన రాళ్ల విషయంలో సోమవారం గొడవపడ్డారు. గొడవలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్ పోటీల్లో క్రీడాకారుల పోరు



వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఎద్దుల బలప్రదర్శనలో బండలాగుతున్న వృషభాలు

హోరాహోరీగా క్రీడా పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో రాష్ట్ర స్థాయిలో పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం అంతర్ రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఇప్పటికే క్రికెట్ టోర్నీ ముగియగా మిగిలిన పోటీలు ప్రారంభమయ్యాయి. ఆయా పోటీల్లో గెలుపుకోసం రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాలనుండి వచ్చిన ఆయా జట్లు గెలుపుకోసం తలపడుతున్నాయి. ఆయా జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు కొనసాగుతున్నాయి.